క్లుప్తంగా

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): నేటి యువత భగత్‌సింగ్ పోరాట పటిమ, దేశభక్తి అలవరుచుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) సింగ్ నగర్ 58వ డివిజన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 116వ జయంతి కార్యక్రమం హోచ్‌మెన్ భవన్ వద్ద జరిగింది. నేతలు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 350 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.వి. భాస్కరరావు, ఏఐవైఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు, నగర పార్టీ కార్యవర్గ సభ్యులు లింగా బత్తుల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. నగర ప్రజానాట్యమండలి అధ్యక్షుడు కామ్రేడ్ ఎస్‌కే నజీర్ విద్యార్థులను ఉద్దేశించి ఆలపించిన గేయాలు రంజింపజేశాయి .

ఆర్థిక సాయం అందజేత




పాయకాపురం(విజయవాడరూరల్): కంజెనింటైల్ లింఫేడిమా వ్యాధితో బాధపడుతున్న పదేళ్ల ఎ.జీవనజ్యోతికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ మంగళవారం రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. రవీంద్ర థియేటర్ ఎదురు పైపులరోడ్డు వద్ద నివసిస్తున్న ఉషారాణి కుమార్తె జీవనజ్యోతి కొంత కాలంగా కంజెనింటైల్ లింఫేడిమా అనే వ్యాధితో బాధ పడుతోంది. చేతిపై భాగంలో ఏర్పడిన గడ్డను తొలగించడానికి తనవంతుగా శ్రీనివాస్ ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, అన్నపురెడ్డి రామిరెడ్డి, దాసం దుర్గారావు, దేవళ్ల అశోక్, ఎం.కోటి తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): భవానీపురం హెడ్‌వాటర్ వర్క్స్‌లోని 5 ఎంజీడీ(పాతది) క్లియర్ వాటర్ సంపును శుభ్రపరచనుండటంతో ప్లాంట్‌ను బ్రేక్‌డౌన్ చేస్తున్నామని ఈ కారణంతో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగో తేదీ ఉదయం 8 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. శ్రీనివాసమహల్, ఫిష్‌మార్కెట్, గాంధీ బావి-1, గాంధీ బావి-2, అంబేడ్కర్ కాలనీ, ఓఆర్‌ఆర్‌ఎస్ ప్రాంతం, గాంధీ హైస్కూల్, రథం సెంటర్, పూలబావి, శివాలయం, కొట్టేటి కోటయ్య, నైజాం గేటు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

శేషసాయిలో 'సూత్ర' ప్రదర్శన



లబ్బీపేట(విజయవాడతూర్పు): పండుగ సీజన్ దృష్ట్యా ఎంజీ రోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో డిజైనర్స్ వస్త్రాలతో సూత్ర ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శన మంగళవారం ప్రారంభమవ్వగా దుస్తులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఢిల్లీ, కోల్‌కతా, నాగపూర్, రాయపూర్, బనారస్, ఉజ్జయిని, భోపాల్, గోవా, బెంగళూరు ప్రాంతాల నుంచి డిజైనర్, లైఫ్ స్టైల్ బ్రాండ్‌లు ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.

శ్యామలాంబకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి దేవాలయంలో మంగళవారం కుంకుమార్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు శ్రీచక్రార్చన విశేష పూజలు చేశారు. సాయంత్రం భక్త బృందంతో భజన, శ్రీలలితాసహస్రనామ పారాయణం జరిగింది.

దాసాంజనేయునికి సిందూర పూజలు

మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి విశేషంగా సిందూరం, ఆకు పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఈవో నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ తదితరులు పర్యవేక్షించారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజలకు అందుబాటులో ఉంటోందన్నారు. 'జగనన్న సురక్ష', 'మా నమ్మకం నువ్వే జగన్' వంటి వంటి కార్యక్రమాలే నిదర్శనమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 36,367 మందికి 11 రకాల సర్టిఫికెట్లు పూర్తి ఉచితంగా అందజేయడం ఒక మైలురాయి అన్నారు. ఆ స్ఫూర్తి నియోజకవర్గంలో నేటికీ కొనసాగుతోందని చెప్పారు. పౌరులు కుల ధ్రువీకరణ పత్రాలు సులభంగా పొందడానికి వీలుగా.. సెప్టెంబర్ 29, 2023 న రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం. 469 విడుదల చేసినట్లు తెలిపారు. ప్రజలకు స్థానికంగానే నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 19 రోజుల పాటు జరిగే ఇంటింటి సర్వేలో కుటుంబ సభ్యులందరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం వారిలో ఏవైనా పెద్ద సమస్యలు గుర్తిస్తే.. ప్రత్యేక క్యాంపులకు తీసుకువస్తారన్నారు. సెంట్రల్‌లో 16 మెడికల్ క్యాంపులను నిర్వహిస్తుండగా.. ఈనెల 6న అజిత్‌సింగ్ నగర్‌లో తొలి క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి క్యాంపులోనూ నలుగురు డాక్టర్లతో పాటు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. రోగులకు 14 రకాల పరీక్షలు చేసి, 105 రకాల మందులను ఉచితంగా అందజేస్తారని మల్లాది విష్ణు వెల్లడించారు. ఈసీజీ, కంటివెలుగుకు సంబంధించిన సేవలు క్యాంపుల వద్ద అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

9 నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి'

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి.. పార్టీ విజయమే లక్ష్యంగా 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. ఈనెల 9 నుంచి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, కోఆర్డినేటర్లు, కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ యంత్రాంగం క్షేత్రస్థాయి పర్యటనలు చేసి ప్రజలతో మమేకమవుతారని తెలిపారు.

మహిళలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

మంత్రి ఆర్.కె.రోజాపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ వ్యాఖ్యలు బాధాకరమని మల్లాది విష్ణు అన్నారు. ఆనాడు చంద్రబాబు ప్రభుత్వంలోనూ సోదరి రోజాను ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు. టీడీపీ నేతలకు మహిళలంటేనే చులకనభావమని.. లక్ష్మీపార్వతి, తహసీల్దార్ వనజాక్షిపై గతంలో ఆ పార్టీ నాయకులు వ్యవహరించిన తీరును రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు. అలాంటి వారిని సమర్థిస్తూ.. వారి తప్పులను నారా లోకేష్ వెనకేసుకురావడం సిగ్గుచేటన్నారు. మహిళ లోకానికి టీడీపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ , కార్పొరేటర్లు కొంగితల లక్ష్మీపతి, ఉమ్మడి రమాదేవి వెంకట్రావు పాల్గొన్నారు.

ఏపీని నంబర్‌వన్‌గా నిలిపిన సీఎం జగన్



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిపారని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ 262వ సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవితో కలిసి ఆయన పాల్గొన్నారు. వాంబేకాలనీలో హెచ్3 బ్లాక్‌లో 320 గడపలను సందర్శించారు. ముఖ్యమంత్రి సంతకం చేసిన బుక్‌లెట్లను అందజేయడంతో పాటు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏళ్ల తరబడి పరిష్కారంకాని హెచ్ బ్లాక్ కాలనీవాసుల సమస్యను ఓటీఎస్ ద్వారా పరిష్కరించినట్లు మల్లాది విష్ణు తెలిపారు. మొత్తం 539 మందికి దస్తావేజులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి గ్రీవెన్స్ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులు, సచివాలయ సిబ్బంది కచ్చితంగా యాక్షన్ టేకెన్ రిపోర్టు (ఏటీఆర్) సమర్పించాలని ఆదేశించారు. మరోవైపు నగర పౌరులు ఇతర ప్రాంతాల్లో మరణించి స్థానికంగా అంత్యక్రియలు జరిగినట్టయితే, చుట్టుపక్కల ప్రజల పంచనామాతో వారికి ఇక్కడే డెత్ సర్టిఫికెట్ ఇవ్వడానికి ఏప్రిల్ 18, 2022న రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. సచివాలయ పరిధిలో నాలుగేళ్లలో రూ.7.68 కోట్లు సంక్షేమానికి అందజేసినట్లు తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ 398 మందికి సచివాలయ పరిధిలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ(ఇంజినీరింగ్) శ్రీనివాస్, నాయకులు నాలం బాబు, అలంపూరు విజయ్, భోగాది మురళి, శనగశెట్టి హరిబాబు,ఆర్ఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి కృషి



వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న సురక్ష పథకాన్ని వినియోగించుకుని ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. డివిజన్‌లో మంగళవారం ఇంటింటికీ జగనన్న సురక్ష పథకం అమలు తీరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రతి ఇంటికీ వలంటీర్లు, ఆశా వర్కర్లు, హెల్త్ సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందజేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో హెల్త్ కార్యదర్శి లక్ష్మీ తిరుపతమ్మ, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): వాకింగ్‌కు వెళ్లిన తల్లి తిరిగి రాలేదని నండూరి నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురం దేవినేని గాంధీపురానికి చెందిన నండూరి రంగమ్మ రోజు మాదిరిగా వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెదికినా ఫలితం లేదని ఆమె చిన్నకుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రెయిన్‌లో గుర్తుతెలియని మృతదేహం

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ-నూజివీడు మెయిన్ రోడ్డు పక్కన పాయకాపురం జీఎస్ అల్లోయ్ క్యాస్టింగ్ కంపెనీ వద్ద డ్రెయిన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. 35 ఏళ్ల వయసుండే పురుషుని మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉంది. వీఆర్వో షేక్ కరిష్మా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గుండ్రని ముఖం, నలుపురంగు జుట్టు, చామన ఛాయ.. 5.5 అడుగుల ఎత్తు ఉంటాడని, నలుపురంగు రౌండ్‌నెక్ టీషర్ట్, నలుపురంగు ప్యాంటు ధరించాడని పోలీసులు తెలిపారు.

మంతెనలో అన్నదానం ప్రారంభం

కంకిపాడు: మండలంలోని మంతెన గ్రామంలో శ్రీ రామభక్త అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. గురుస్వాములు చిమటా ప్రసాద్, తాతా వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 48 రోజులు పాటు నిర్విరామంగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేశారు. అయ్యప్ప, భవాని, శివ, గోవింద దీక్షలు స్వీకరించిన స్వాములకు సద్దిని ప్రతి రోజూ అందించనున్నారు. గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్న సద్ది కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కొండవీటి వెంకట సుబ్బారావు, మాదు సుబ్రమణ్యం, మాదు శ్రీను, ఉప్పలూరు సాయి, యాదల శ్రీను, వీరంకి నాగు, ఉప్పలూరు సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పైపుల రోడ్డులోని ఆహ్వానం కల్యాణ మండపంలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ఆరా తీశారు. ప్రతి ఒక్క సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని ఆదేశించారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన రేషన్ కార్డుల అర్జీలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఒకసారి జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం జీవిత కాలం పని చేస్తుందని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 29, 2023న జీవో నెం 469 విడుదల చేసినట్లు మల్లాది విష్ణు తెలిపారు. అనంతరం ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై చర్చించారు. ఇప్పటివరకు అందిన దరఖాస్తులపై సచివాలయాల వారీగా ఆరా తీశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నార్త్ తహసీల్దార్ మాధురి, సెంట్రల్ తహసీల్దార్ శ్రీను, అసిస్టెంటు సిటీ ప్లానర్ -2 జగదీష్, ఏఎస్ఓ శ్రీలక్ష్మి, కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి,ఎండీ షాహినా సుల్తానా, శర్వాణి మూర్తి, కొంగితల లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారులకు క్రెడిట్ క్యాంప్

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వీధి విక్రయదారులకు అందిస్తున్న పీఎం స్వనిధి పథకంలో కొత్తగా రుణం పొందడానికి క్రెడిట్ క్యాంప్ నిర్వహిస్తున్నామని వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి శకుంతల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగే క్రెడిట్ క్యాంపును సర్కిల్-1 పరిధిలోని విద్యాధరపురంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ వద్ద ఉన్న వార్డు సచివాలయం నంబర్ 117లో జరుగుతుందని పేర్కొన్నారు. 7వ తేదీన సర్కిల్-2 పరిధిలో గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో జరుగుతుందని, సర్కిల్-3 పరిధిలో 10వ తేదీన కృష్ణలంక చలసాని నగర్‌ని శాంపిల్ బిల్డింగ్‌లో ఉన్న సచివాలయం 79లో జరుగుతుందని వివరించారు. ఆయా తేదీల్లో జరిగే క్రెడిట్ క్యాంప్ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు తమ వెంట ఆధార్‌లింకైన ఫోన్‌ను తీసుకురావాలని, రెండు ఆధార్ జిరాక్స్‌లు, రెండు రేషన్ కార్డు జిరాక్స్‌లు, పాన్‌కార్డు(ఉంటే) లేదా ఓటరు గుర్తింపు జిరాక్స్ రెండు, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ కలిగినవారు పాస్‌పుస్తకం రెండు జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకుని ఆయా తేదీల్లో జరిగే క్యాంపునకు హాజరు కావాలని పేర్కొన్నారు.

వాసవీ సేవా సంఘం కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

రామవరప్పాడు: శ్రీ వాసవీ సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని రామవరప్పాడులో మంగళవారం నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, కరెన్సీనగర్, మురళీనగర్ ప్రాంతాల్లోని సేవా సంఘం సభ్యులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అర్బన్ జిల్లా అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ(కొండపల్లి బుజ్జి) ఎన్నికైన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సేవా సంఘం విజయవాడరూరల్ మండల నూతన అధ్యక్షుడిగా మాదాల వెంకట రమేష్, ఉపాధ్యక్షులు పురిమి సుబ్రహ్మణ్యం, కోట రామకృష్ణారావు, కార్యదర్శి చిన్ని సుబ్రహ్మణ్యం కోశాధికారి చీదెళ్ల వెంకట నాగేశ్వరరావులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పల్లపోతు మురళీకృష్ణ మాట్లాడుతూ సంఘ మాజీ అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు 4 ఏళ్ల పాటు సేవలందించారన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సంఘ అభివృద్ధికి కృషి చేయాలని, పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

సైబర్ ట్రాఫికింగ్‌తో అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: నేటి యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారని ప్రజ్వల సంస్థ సీనియర్ కో-ఆర్డినేటర్ వై చంద్రయ్య తెలిపారు. మైలవరం డీఆర్‌డీఏ కార్యాలయం సమావేశ హాలులో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, ఎన్టీఆర్ జిల్లా మైలవరం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ ఈ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా గత 26 సంవత్సరాలుగా డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత ఐసీడీఎస్, పోలీస్, జ్యుడీషియల్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఇప్పటి వరకు 27,000 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించినట్లు పేర్కొన్నారు. యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కు గురవుతున్నారన్నారు. వారిని గమనిస్తూ అప్రమత్తం చేయాలన్నారు. ప్రస్తుతం తెలంగాణా వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తూ సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. చట్టాలు శిక్షలు, ప్రభుత్వ పథకాలు గురించి మహిళా హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098(112), 100, 1930, సైబర్ ట్రాఫికింగ్ గురించి తెలియజేసినట్లు పేర్కొన్నారు కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్, మహిళలు, విద్యార్థులు, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శ్రావ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకట రత్నం పాల్గొన్నారు.

జంక్షన్ల అభివృద్ధికి చర్యలు

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌నగర్ ప్రాంతంలోని జంక్షన్లను మరింత అభివృద్ధి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన అజిత్‌సింగ్‌నగర్‌లోని నూజివీడు రోడ్డులో మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఆయన 15వ ఆర్థిక సంఘం ఎయిర్ పొల్యూషన్ గ్రాంటు నుంచి నూజివీడు రోడ్డులో పోలీసు జంక్షన్ నుంచి కండ్రిక జంక్షన్ వరకు 500 మీటరు పొడవునా రోడ్డు పక్కన నిర్మాణం జరుగుతున్న పెవర్ బ్లాక్స్, సైకిల్ ట్రాక్, ఫుట్‌పాత్ ఏర్పాటు పనులను పరిశీలించారు. రోడ్డుకు రెండువైపులా పెవర్ బ్లాక్స్ ఏర్పాటు చేయడం, స్థానికంగా గ్రీనరీని మరింత అభివృద్ధి చేయాలని ఉద్యానవన అధికారులకు సూచించారు.

ఐకానిక్ పార్కు పరిశీలన

నగరవాసులకు అభివృద్ధితోపాటు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించడానికి వీఎంసీ పార్కులను అభివృద్ధి చేస్తోందని కమిషనర్ స్వప్నిల్‌దినకర్ అన్నారు. మంగళవారం ఆయన అజిత్‌సింగ్‌నగర్‌లో ఎక్సెల్‌ప్లాంట్‌లో నిర్మాణంలో ఉన్న ఐకానిక్‌పార్కును పరిశీలించారు. అక్కడ ప్రహరీ పనులు, పార్కు ఆవరణలో చేపట్టిన పౌండేషన్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనుల అభివృద్ధికి కృషి

కలెక్టర్ ఢిల్లీరావు



కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిసిన శాలివాహన సంఘం సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శాలివాహనుల (కుమ్మరి) అభివృద్ధికి కృషి చేద్దామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. రాష్ట్ర కుమ్మరి/శాలివాహన సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం.పురుషోత్తం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా శాలివాహన సంక్షేమ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో శాలివాహనులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. శాలివాహనులకు సమాజంలో సముచిత స్థానం కల్పించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు జిల్లా స్థాయి కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. సంస్థ చైర్మన్ ఎం. పురుషోత్తం మాట్లాడుతూ శాలివాహన సంక్షేమానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫెడరేషన్ ఏర్పాటు చేశారని, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. దీనితో పాటు అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయి శాలివాహన సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేశారన్నారు. మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. టీటీడీలో ప్లాస్టిక్ వాడక నిషేధం అమలులో ఉన్నందున ప్రత్యామ్నాయంగా పర్యావరణ అనుకూల మట్టికప్పులను వినియోగించేలా చర్యలు తీసుకోవడం ద్వారా శాలివాహనులకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం సభ్యులు చెన్నయ్య, టి.దుర్గాప్రసాద్, ఆర్. కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

11 నుంచి సినీ సంగీత నవరాత్రులు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా విజయవాడ కళా సంస్థల ఆధ్వర్యంలో 11వ తేదీ నుంచి తొమ్మిది రోజులు సినీ సంగీత నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి పరచూరి విజయలక్ష్మి మంగళవారం వివరించారు. గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై విలేకరుల సమావేశం, పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. నగరంలోని కళాసంస్థలు ఐక్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నిర్వాహక సంఘ సభ్యుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో కార్యక్రమం జరుగుతుందని సావిత్రి కళాపీఠం, ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా, పల్లెంకొండ ఆర్ట్స్, జెసీరాజ్ స్వరాంజలి, సింధు ఈవెంట్స్, సునీల్ ఆర్కెస్ట్రా, సువర్ణమణి రిథమ్స్, తెలుగు కళావాహిని, డ్రీమ్ ఆడియో, గీతాంజలి మ్యూజిక్స్ వారికి కేటాయించిన రోజుల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో డేవిడ్‌రాజు, జయప్రభ పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా



కేసుల విచారణ చేస్తున్న న్యాయమూర్తి వి.విజయ్‌కుమార్

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ పరిధిలోని ఆయా డివిజన్లలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు పలువురిపై నమోదైన కేసుల్లో మున్సిపల్ న్యాయమూర్తి వి. విజయ్‌కుమార్ విచారణ చేశారు. సర్కిల్-1 కార్యాలయంలో మంగళవారం జరిగిన మొబైల్ కోర్టులో చెత్త రోడ్లపై వేసేవారు, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టేవారు, రోడ్లపై పెంపుడు జంతువుల్ని వదిలేవారు, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై కేసు నమోదైన 17 మందిని విచారణ చేశారు. వారందరికీ రూ.5,720 జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్-1, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళాశాలలో అగ్ని ప్రమాదం



అగ్నిప్రమాదం జరిగిన గది



బుగ్గిపాలైన పుస్తకాలు

- భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన విలువైన గ్రంథాలు బుగ్గిపాలు
- షార్ట్ సర్క్యూటే కారణమంటున్న అధికారులు

విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో మంగళవారం ఉదయం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన వందలాది పుస్తకాలు గదిలో భద్రపరిచారు. చాలా ఏళ్లుగా వినియోగంలో లేక పోవడంతో పుస్తకాలు చెదలు పట్టి పూర్తిగా పాడయ్యాయి. ఉదయం సంగీత కళాశాలలో కర్రసాము శిక్షణనిస్తున్న విజయ్ మాస్టార్ కళాశాలలో మూలగా ఉన్న గది నుంచి పొగలు రావడం గమనించారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఘటనలో సంబంధిత శాఖ వాచ్‌మన్‌కు స్వలంగా గాయాలయ్యాయి. అగ్ని ప్రమాదం జరిగిన గది చాలాకాలంగా వినియోగంలో లేదని ఉమ్మడి ఏపీలో భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన పుస్తకాలను అందులో భద్రపరిచామని షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని సాంస్కృతిక శాఖ సీఈవో ఆర్ మల్లికార్జునరావు తెలిపారు. ఫైర్ సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేశారన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 12 మందికి జైలు, జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మంగళవారం మూడో ట్రాఫిక్ పోలీసులు 12 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని ఏడో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి కె. సురేష్ బాబు పలువురికి జైలు, జరిమానా విధిస్తు తీర్పు వెల్లడించారు. అందులో ముగ్గురు వ్యక్తులకు 9 రోజుల జైలు, రూ.10 వేలు జరిమానా, ఒక వ్యక్తికి 7 రోజుల జైలు, రూ. 10వేలు, ఒక వ్యక్తికి 5 రోజుల జైలు, రూ. 10వేలు, ఒక వ్యక్తికి 4 రోజుల జైలు, రూ. 10వేలు, ఒక వ్యక్తికి 3 రోజుల జైలు, రూ. 10వేలు, ఒక వ్యక్తికి 1 రోజు జైలు, రూ. 10వేలు జరిమానా, మిగిలిన నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకుదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్త అద్దంకి ఉమాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారు రోజుకు ఒక అలంకారంలో భక్తుల పూజలు అందుకుంటారని పేర్కొన్నారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు.